@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || బుధవారం 10, జులై 2024 || పేజీలు: 04




## కేటీఆర్.. మీ దాకా వస్తే గానీ
# తెలియడం లేదా?
## ఇప్పుడు సన్నాయి నొక్కులెందుకు?

- ఈ సర్కారు నెల రోజుల్లో కూలుతుందని అనలేదా?
- ప్రభుత్వం సుస్థిరంగా ఉండేందుకు చేరికలు తప్పవు
- బలహీనపడినప్పుడల్లా పిల్లిల్ని రెచ్చగొడుతున్నారు
- డీఎస్సీపై బీఆర్ఎస్, కోచింగ్ సెంటర్లది కృత్రిమ ఉద్యమం..
- పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో దీక్షలు చేయించడం కాదు.. హరీశ్, కేటీఆర్ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఆమరణ దీక్ష చేయాలి
- మహబూబ్‌నగర్ సమావేశంలో సీఎం రేవంత్

మహబూబ్‌నగర్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 9:

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో** చేరుతుండడంపై పార్టీ ఫిరాయింపులంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, పదేళ్లలో బీఆర్ఎస్ ఇదే పద్ధతిన కాంగ్రెస్ సభ్యులను చేర్చుకోలేదా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అప్పుడు ఇదంతా ఏమైందని.. ఆయన వరకు వస్తే కానీ, బాధ తెలియలేదా? అని నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నం చేయలేదా? ఈ సర్కారు నెల రోజుల్లో కూలుతుందని కేసీఆర్ అనలేదా? అని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ సుస్థిరత కోసం చేరికలు తప్పవన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని, లేకపోతే ఫామ్‌హౌజ్‌లో పడుకోవాలని, కాళ్లలో కట్టె పెడితే వీపు విమానం మోత మోగుతుందని కేసీఆర్‌ను హెచ్చరించారు. మిగతా 2లో..

## భారత్‌ను అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా
# తీర్చిదిద్దుతా



- పదేళ్లలో 40వేల కిలోమీటర్ల రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశాం..
- ఈ అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమే
- ఆత్మవిశ్వాసంతో ముందడుగేస్తున్నాం..
- మాస్కో ఎన్నారైల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ..

మాస్కో, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 9:

**రాబోయే ఐదేళ్ల పదవీకాలంలో** భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారుస్తామని ప్రధాని మోదీ అన్నారు. గత పదేళ్లలో భారత్ ఎంతగానో పురోభివృద్ధి సాధించిందని అననారు. ఇటీవలే మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశానని, మూడు రెట్ల వేగంతో పని చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. మిగతా 3లో..

## అల్పాహారం తిని 20మందికి అస్వస్థత

- రామాయంపేట మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఘటన
- చికిత్సతో కోలుకుంటున్న విద్యార్థినులు

3





## చట్నీలో చిట్టెలుక

- జేఎన్‌టీయూలో కలకలం
- విచారణకు మంత్రి దామోదర ఆదేశం

వివరాలు 02లో..



## వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి
# కల్యాణోత్సవం

- ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో ప్రోటోకాల్ రగడ
- కలెక్టర్ తీరుపై మంత్రి పొన్నం నిరసన

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 9:

**హైదరాబాద్ బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారి** కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణానికి ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. ఎల్లమ్మ కల్యాణానికి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ,పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి మిగతా 2లో..

## కేఆర్ఎంబీ పరిధిలోకి
# కృష్ణా ప్రాజెక్టులు
## ఏపీ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం విచారణ
### కేంద్రం తరపున నివేదిక దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 9:

**కృష్ణానది పరివాహక** ప్రాంతంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ గతంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఒఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ విషయంపై మిగతా 2లో..

## మా హయాంలో ఫిరాయింపులు కాదు..
# విలీనం చేసుకున్నాం

- ప్రస్తుత ఫిరాయింపులపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం
- సుప్రీంకు వెళ్తాం.. పార్లమెంటులో ప్రస్తావిస్తాం
- ప్రజాసంబంధాల విషయంలో విఫలమయ్యాం
- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకే కవితను జైలుకు..
- కేంద్రంలో ఏపీ సీఎం చంద్రబాబుది కీలక పాత్ర
- తెలంగాణలో టీడీపీ బలపడితే.. మాకే లబ్ధి
- ఏపీలో జగన్ ఓడిపోతారని ఊహించలేదు
- ఢిల్లీలో మీడియాతో కేటీఆర్ వ్యాఖ్యలు

వివరాలు 02లో..



## గ్రామ సమైఖ్య సంఘాలకు
# ఆర్థిక సాయం

- మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం
- ఈ సీజన్‌లో 20.02 కోట్ల మొక్కలు నాటే లక్ష్యం
- సీజనల్ వ్యాధులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు
- జల్లా కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి



హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–జులై 9:

**రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని** 25వేల గ్రామ సమైఖ్య సంఘాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సీఎం రేవంత్ ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను మిగతా 2లో..

## శాస్త్రసాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు

2



- సాంకేతికతో పాటు సవాళ్లు వస్తున్నాయి
- సైన్స్ గ్రాడ్యుయేషన్ డేలో రాష్ట్రపతి ముర్ము



## మహిళలకు హామీలిచ్చి మోసం చేస్తారా?

- ఇందిరా పార్క్ వద్ద మహిళా మోర్చా ధర్నా
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరును విమర్శించిన కిషన్ రెడ్డి

2

## డ్రైపోర్టుకు మచిలీపట్నం పోర్టుతో
# అనుసంధానం

- దినికోసం హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలి
- ఢిల్లీ ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల ముందు సీఎం రేవంత్ ప్రతిపాదన

వివరాలు 02లో..



## డ్రైపోర్టుకు మచిలీపట్నం

# పోర్టుతో అనుసంధానం

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**

సముద్ర తీరం లేని తెలంగాణలో ఏర్పాటు చేసే డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేలా హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ(జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఉన్నతాధికారులను కోరారు. తెలంగాణలో నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అడ్డంకిగా ఉన్న చిక్కుముడులను తొలగించే అంశాలపై చర్చించేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల బృందం మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసింది. బుధవారం ఆ బృందంతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తనను మంగళవారం కలిసిన అధికారులతో కొన్ని ముఖ్యమైన అంశాలపై ఆయన చర్చించారు. తెలంగాణలో నిర్మిస్తున్న రోడ్లకు సంబంధించిన సమస్యలను తమ స్థాయిలో పరిష్కరించదగ్గవాటిని పరిష్కరిస్తామని, భూసేకరణ అంశాలను కొలిక్కి తెస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్రైపోర్టుకు బందరు పోర్టుతో కనెక్టివిటీ ప్రతిపాదనపై చర్చించారు. అలాగే హైదరాబాద్%-%విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావించారు. రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టును భారత్‌మాల పరియోజనలో భాగంగా చేపట్టాలని ఇటీవల తాను ప్రధానికి సూచించిన విషయాన్ని వారి ముందు ప్రస్తావించారు. ఓఆర్ఆర్%-%ఆర్ఆర్ఆర్ మధ్య 12 రేడియల్ రోడ్లు వస్తాయని, వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్‌షిప్స్ నిర్మిస్తామని వెల్లడించారు.

వెంటనే రీజినల్ రింగ్ రోడ్డు పనులను, మన్నెగూడ జాతీయ రహదారి విస్తరణ పనులను ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్-కల్వకుర్తి పనులను పూర్తిచేస్తే తిరుపతికి 70 కి.మీ. దూరం తగ్గుతుందని పేర్కొన్నారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ రోడ్డుకు సంబంధించిన భూమి అప్పగింత, ఆర్మూరు-జగిత్యాల-మంచిర్యాల భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు, వరంగల్-కరీంనగర్ రహదారి నిర్మాణానికి చెరువు మట్టి, ఫ్లైయాష్ సేకరణ, కాళ్లకల్%-%గుండ్లపోచంపల్లి రహదారి ఆరు వరసల విస్తరణకు భూ సేకరణ, జాతీయ రహదారుల నిర్మాణంలో విద్యుత్ సంస్థలతో తలెత్తుతున్న సమస్యల పరిష్కారం, ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కోదాడ రహదారుల నిర్మాణంలో పోలీసు భద్రత ఏర్పాటు.. తదితర అంశాలను ఎన్‌హెచ్ఐఏ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై బుధవారం సమగ్రంగా సమీక్షించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు కూడా ఈ భేటీలో పాల్గొననున్నారు. పలు సమస్యలకు ఈ సమావేశంలో పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

# చట్నీలో చిట్టెలుక

**సంగారెడ్డి, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**

సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ హాస్టల్ వంట గదిలోని చట్నీ పాత్రలో చిట్టెలుక ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. ఈ సంఘటనపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలివి. సంగారెడ్డి జిల్లా చౌట్కూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ హాస్టల్ మెస్ పనితీరు వారం రోజులుగా బాగా లేదని విద్యార్థులు పలుమార్లు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి విద్యార్థులు తినే చట్నీలో చిట్టెలుక ప్రత్యక్షమైంది. దాన్ని విద్యార్థులు వీడియో తీసి మంగళవారం సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో వైరంగా మారింది. విషయం తెలియగానే కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ మంగళవారం ఉదయం హాస్టల్‌కు వెళ్లి పరిశీలించారు. చట్నీలో ఎలుక పడటం వాస్తవమేనని, కానీ విద్యార్థులు తిన్న తర్వాత కడిగేందుకు నీళ్లు పోసి ఉంచిన పాత్రలోనే ఎలుక ఉందని ఆయన స్పష్టం చేశారు. చట్నీలో ఎలుక పడిన ఘటనపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణం విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్, ఆర్డీవో, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని హాస్టళ్లు, క్యాంటీన్లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. నిబంధనలు పాటించని సంస్థల లైసెన్స్‌లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, హాస్టళ్లు, క్యాంటీన్లలో ఆహార పదార్థాలు తయారు చేసే నిర్వాహకులపై నిఘా ఉంచాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ మాధురి హాస్టల్‌ను సందర్శించి అక్కడి అపరిశుభ్ర వాతావరణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా శుభ్రం చేయకుండా పాత్రలను అలాగే ఉంచడమేమిటని కాంట్రాక్టర్‌ను నిలదీశారు. బాధ్యులను వెంటనే తొలగించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట అందోల్ ఆర్డీవో పాండు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి..)

కూడా హాజరయ్యారు. ఎల్లమ్మ తల్లి దేవస్థానం అమ్మవారి గర్భాలయాన్ని ఆలయ అధికారులు ప్రత్యేకంగా అలకంరించారు. అమ్మవారి మూలవిరాట్ కు బంగారు చీరతో అలంకరణ చేశారు. ఎల్లమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి 27 చీరలు,స్వామి వారికి 11 పంచెలతో . రంగు రంగుల పూలతో అమ్మవారి ప్రధాన ఆలయం, పరిసరాలను తీర్చిదిద్దారు. అమ్మవారి మూలవిరాట్‌కు బంగారు చీరతో అలంకరణ చేశారు. ఆలయంలో ఎల్లమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమచ్చారు. రంగురంగు పూలతో అమ్మవారి ప్రధాన ఆలయం, పరిసరాలను తీర్చిదిద్దారు సిబ్బంది. భక్తుల కోసం క్యూలైన్లు, ÷ఎఖ ఎంట్రీ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. లక్షల్లో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. మూడ్రోజుల కల్యాణ మహోత్సవంలో భాగంగా మొదటి రోజు పెళ్లి కల్యాణ మహోత్సవం జరిగింది. బుధవారం ఉదయం 5 గంటలకు నాదస్వర మంగళ వాయిద్యములు, అభిషేకం నిర్వహిస్తారు. దేవతాపూజలు, అగ్ని ప్రతిష్ఠ గణపతిహోమం, మహా శాంతి హోమం, బలిహరణం, పూర్ణాహుతి ఉంటాయి. అలాగే రాత్రి ఆరు గంటల నుంచి అమ్మవారి రథోత్సవం జరుగనుంది. దీంతో కళ్యాణ ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు వచ్చే భక్తులకు పార్కింగ్ ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

**ఎల్లమ్మ కళ్యాణోత్సవంలో ప్రొటోకాల్ రగడ..**

నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కల్యాణంను చూడటానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలి వచ్చారు. ఇక్కడి వరకూ అంతా బాగానే ఉంది కానీ.. ప్రోటోకాల్ రగడ నెలకొంది. పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పొన్నం తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈ ప్రొటోకాల్ వివాదంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, మేయర్ గద్వాల విజయ లక్ష్మి అలకబూనారు..! అసహనంతో ఆలయం బయటే కూర్చుని ఒకింత నిరసన తెలిపినట్లు చేశారు. ఈ క్రమంలోనే తోపులాట కూడా జరిగింది. దీంతో మేయర్‌కు గాయాలయ్యాయి కూడా. కనీసం ప్రొటోకాల్ ప్రకటించడానికి మీకొచ్చిన ఇబ్బందేంటి..? అని ఆలయ అధికారులను మంత్రి ప్రశ్నించారు. చివరికి అధికారులు రంగంలోకి దిగి ఒకటికి రెండుసార్లు నచ్చచెప్పడంతో మంత్రి, మేయర్ అలక వీడారు. అనంతరం కల్యాణోత్సవంలో పొన్నం, విజయలక్ష్మి పాల్గొన్నారు. ఇదిలా ఉంటే.. తెలంగాణ ప్రభుత్వం తరపున అమ్మవార్లకు అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకుని పట్టువస్త్రాలు

## కేటీఆర్.. మీ వరకు వస్తే కాని

# బాధ తెలియడం లేదా?

(మొదటి పేజీ తరువాయి..)

మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "హుజూరాబాద్ ఉప ఎన్నికలో కాంగ్రెసకు 3 వేల ఓట్లు వచ్చినప్పుడు పార్టీ, రేవంత్‌రెడ్డి పని అయిపోయిందని శునకానందం పొందారు. కానీ, 1.50 శాతం ఓట్ల నుంచి 40 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చాం. కాంగ్రెస్ కార్యకర్తలతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని ఆ రోజే చెప్పాం. వారి ఉసురు తగిలి మట్టికొట్టుకుపోయారు. ఇక బీఆర్ఎసకు మనుగడ ఉండదు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెసది అన్యాయం అంటున్నారు. పదేళ్లు కాంగ్రెస్ కార్యకర్తలను కొట్టి, చంపి జైల్లో పెట్టినప్పుడు కేసీఆర్ రాజనీతి ఎక్కడికి పోయింది? మేం అక్రమ కేసులు పెట్టడం లేదు. కేసీఆర్‌కు ముందుంది ముసళ్ల పండగ" అని రేవంత్ అన్నారు. రైతు రుణమాఫీ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు.

త్వరలోనే కొత్త పీసీసీ ఏర్పాటవుతుందని, అనంతరం అన్ని జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. కార్యకర్తల కష్టంతోనే ఎమ్మెల్యేలు గెలిచారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం ఎమ్మెల్యేలు వారికంటే ఎక్కువ కష్టపడాలని రేవంత్ సూచించారు. తనకు సీఎం పదవి నాయకుల వల్ల రాలేదని, కార్యకర్తల కష్టంతో వచ్చిందన్నారు. 35 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామని, నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇన్‌చార్జి మంత్రులతో కలిసి పనులు చేసుకోవాలని సూచించారు.

**శవాల మీద రాజకీయం కేసీఆర్‌కు అలవాటే**

బీఆర్ఎస్ బలహీనపడినప్పుడల్లా అమాయక పిల్లలను రెచ్చగొట్టి ఉద్యమాలు చేయించి వారిని బలిచేస్తున్నారని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. శవాల మీద రాజకీయం చేసి పబ్బం గడుపుకోవడం కేసీఆర్‌కు అలవాటని మండిపడ్డారు. తమను కాపాడమని కేటీఆర్, హరీశ్‌లు ఢిల్లీలో మోదీ చుట్టూ తిరుగుతున్నారని, అయినా చేసిన తప్పులకు లెక్కలు చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. "డీఎస్సీ వాయిదా వేయాలంటూ దళిత, గిరిజన విద్యార్థులతో దీక్షలు చేయించడం కాదు.

బావబామ్మర్దులు హరీశ్, కేటీఆర్ ఓయూ ఆర్ట్స్ కళాశాల దగ్గర ఆమరణ దీక్షకు కూర్చోవాలి. డీఎస్సీ వాయిదా పడడమో, వారి ప్రాణాలు పోవడమో జరగాలి. డీఎస్సీ వాయిదా ఉద్యమం.. రూ.వందల కోట్లు సంపాదనకు కోచింగ్ సెంటర్లు, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న కృత్రిమ ఉద్యమం. కోచింగ్ సెంటర్ల మాఫియా కోసం పరీక్షను రద్దు చేయడం కుదరదు" అని తేల్చిచెప్పారు. పదేపదే పరీక్షల రద్దు కోసం ప్రతిపక్షం కుట్ర చేస్తోందని.. వాయిదాల డిమాండ్ వెనుక కోచింగ్ సెంటర్ల కుట్ర కూడా ఉందని ఆరోపించారు. వాయిదాతో తనకు వచ్చే నష్టం ఏమీ లేదని లక్షలమంది నిరుద్యోగులు నష్టపోతారని అన్నారు. డీఎస్సీ ద్వారా 11,500 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే ప్రతి తల మాసినోడు వచ్చి వాయిదా వేయాలంటున్నారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలు నిర్వహిస్తామని, ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 31 వరకు ఫలితాలు వెల్లడించి.. వెయ్యి మంది గ్రూప్-1 అధికారులను నియమిద్దామంటే దొంగలంతా కలిసి గూడుపుఠాణీ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలన పదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, 1:50 ప్రాతిపదికన గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపిక చేస్తే 1:100 నిష్పత్తి ప్రకారం పిలవాలని డిమాండ్ చేస్తున్నారని, దీనివెనుక ప్రతిపక్షాల కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు చెప్పినట్లు చేస్తే కోర్టుకు వెళ్తారని.. నోటిఫికేషన్‌లో లేకుండా ఎలా పిలుస్తారని పరీక్షను రద్దు చేసే ప్రమాదం ఉందన్నారు. 19 వేలమంది ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చి రాజకీయ ప్రమేయం లేకుండా బదిలీ చేశామని చెప్పుకొచ్చారు.

## మా హయాంలో ఫిరాయింపులు కాదు..

# విలీనం చేసుకున్నాం

**న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**

తెలంగాణలో చోటుచేసుకుంటున్న ఎమ్మెల్యేల ఫిరాయింపులపై రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్వరలోనే సుప్రీంకోర్టునూ ఆశ్రయిస్తామని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామని తెలిపారు. ఇప్పటికే హైకోర్టులో కేసు వేశామని, స్పీకర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. మంగళవారం ఢిల్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావుతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్ చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ హయాంలో బీఆర్ఎస్ పార్టీలో శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్నామే తప్ప.. ఒక్కో ఎమ్మెల్యేను చేర్చుకుంటూ ఫిరాయింపులకు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ శాసనసభాపక్షాలను బీఆర్ఎసఎల్పీలో విలీనం చేసుకున్నామని తెలిపారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి తమ ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఓవైపు రాజ్యాంగం గొప్పతనం గురించి మాట్లాడుతూ.. మరోవైపు అదే రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని అన్నారు. కర్ణాటక, గోవాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల కొనుగోలుపై బీజేపీని తప్పుబడుతూ, మరోవైపు తెలంగాణలో మాత్రం ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి తీసుకుని ఫిరాయింపులకు పాల్పడుతున్నారని, పాత్రధారి తెలంగాణలో ఉంటే, సూత్రధారులు ఢిల్లీలో ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పార్టీని జాతీయ స్థాయిలో ఎండగట్టడానికే ఢిల్లీకి వచ్చామని, మూడు, నాలుగు రోజులుగా న్యాయ, రాజ్యాంగ నిపుణులతో చర్చించామని తెలిపారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించారు. ఇంతకంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఇంకేం ఉంటుంది? కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేస్తోందంటూ సీఎం సిద్ధరామయ్య అంటున్నారు. తెలంగాణలో మా ఎమ్మెల్యేలకు రూ.50 కోట్లు ఇస్తున్నారో? ఇంకా ఎక్కువే ఇస్తున్నారో తెలియదు. రాజ్యాంగ రక్షకుడిగా రాహుల్‌గాంధీ ఆస్కార్ అవార్డు స్థాయిలో నటిస్తున్నారు. దానం నాగేందర్‌తోపాటు మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేస్తారని ఆశిస్తున్నాం" అని కేటీఆర్ పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే న్యాయపోరాటం చేస్తామని, హైకోర్టులో తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిరాయింపులకు పాల్పడిన చోట త్వరలోనే ఉప ఎన్నికలు రావడం ఖాయమని అన్నారు.

**14 సీట్లలో స్వల్ప తేడాతో ఓడిపోయాం..**

తెలంగాణలో అన్ని పార్టీల్లోకెల్లా అతిపెద్ద నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు. అలాంటిది బీఆర్ఎసలో ఆయనను కాదని పోటీ ఎందుకుంటుందని ప్రశ్నించారు. "అసెంబ్లీ ఎన్నికల్లో 14 సీట్లలో స్వల్ప తేడాతోనే ఓడిపోయాం. 1000 నుంచి 5వేల ఓట్లతోనే ఓటమి పాలయ్యాం. కానీ, ఒక్క ఓటుతో ఓడిపోయినా ఓటమే కదా? బీజేపీ అయోధ్యలో ఓడిపోయింది. ప్రశాంత్ కిషోర్ సొంతంగానే పార్టీని నడపలేకపోయారు. ఇక ఆయన పార్టీలను ఎలా గెలిపిస్తారు? తెలంగాణలో బీజేపీ ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ పార్టీయే కదా? అయినా ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా ఏదో ఒక కూటమికే ప్రజలు ఓట్లు వేశారు. ఈ రెండు కూటములతో లేని పార్టీలను ప్రజలు ఆదరించలేదు. ఇప్పుడు కిందపడ్డాం.. మళ్లీ లేవాలి." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కేంద్రంలో చంద్రబాబునాయుడు కీలక స్థానంలో ఉన్నారని, ఆయన ద్వారా తెలుగు రాష్ట్రాలకు మంచి జరిగితే స్వాగతిస్తామని అన్నారు. "రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సమావేశాన్ని ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంగానే చూడాలి. మేము ప్రతిపక్షంలో ఉన్నంతమాత్రాన రాష్ట్రం బాగుపడొద్దని మేమేందుకు అనుకుంటాం? నిధులు రావాలి.. పరిశ్రమలు రావాలి.. అభివృద్ధి జరగాలి. అయినా.. నాలుగేళ్ల తర్వాత ఏం జరుగుతుందో తెలియదు. అభివృద్ధి, సంక్షేమం వల్లే ఓట్లు వేయరని తేలిపోయింది కదా? అందుకే.. ఈ నాలుగేళ్లు మంచి జరగాలని ఆశిస్తాం" అని కేటీఆర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలను ఊహించలేదన్నారు. జగన్ సంక్షేమం చేసినందున గెలుస్తారని భావించాం తప్ప.. ఎవరి మీదా ప్రత్యేకంగా ప్రేమ లేదని అన్నారు. "జగన్ వ్యతిరేకఓట్లన్నీ ఏకమయ్యాయి. అయినా.. ఆయన పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. జగన్‌ను ఓడించేందుకు షర్మిలను ఒక వస్తువులా ఉపయోగించారు. అంతకుమించి షర్మిలతో అయ్యేదేమీ లేదు. జగన్ హీరో.. షర్మిల జీరో" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.కేసీఆర్‌కు, తనకు అహంకారం ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. అయితే.. అది అహంకారం కాదని, ఆత్మవిశ్వాసమని చెప్పారు. తెలంగాణ అంటే పడనోళ్లు చేసే అసత్య ప్రచారన్నారు. "2014లో తెలంగాణ ఏర్పడితే ఎప్పుడైనా అహంకారం చూపించామా? ఎంతోమంది యూట్యూబ్ వేదికగా బండబూతులు తిట్టారు. ఎవరినైనా ఏమైనా అంటున్నామా? కానీ, రేవంత్ రెడ్డి చిన్న వార్త వస్తేనే తట్టుకోలేకపోతున్నారని అన్నారు.

## శాస్త్రసాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు

**భువనేశ్వర్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**

నూతన సాంకేతిక పరిణామాలు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని, అదే సమయంలో మానవాళికి కొత్త సవాళ్లను కూడా విసురుతున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 13వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సైన్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే స్థాయిలో దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. కొత్త సాంకేతికత వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అదే సమయంలో మానవాళికి అది సరికొత్త సవాళ్లను విసురుతుంది. ఉదాహరణకు క్రిస్పార్-క్యాస్9 సాంకేతికత వల్ల మానవుల జన్యువులల్లో మార్పులు చేయడం చాలా సులభమైంది. ఎన్నో రకాల వ్యాధులను నయం చేసేందుకు సహకరించింది. అయితే, ఈ సాంకేతికత సామాజికంగా ఎన్నో రకాల సమస్యలు సృష్టించింది. అంతేకాకుండా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందిన కృత్రిమమేధ వల్ల డీప్ ఫేక్ సమస్య ఎదురైంది. సాంకేతికతను సక్రమ మార్గంలో ఉపయోగించకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించలేం' అని ద్రౌపది ముర్ము అన్నారు. సైన్స్ హేతుబద్ధతకు సంప్రదాయ విలువలను జోడిస్తూ ఎన్ఐఎస్ఈఆర్ ముందుకు వెళుతుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. 'జాతిపిత మహాత్మాగాంధీ ఏడు సామాజిక రుగ్మతలు ఉంటాయని విశ్వసించేవారు. అందులో 'దయలేని సైన్స్' కూడా ఒకటి. జాలి, దయ, మానవత్వం గురించి ఆలోచించకుండా సైన్స్‌ని ప్రచారం చేయడం మహా పాపం. ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలి' అని హితవు పలికారు. శాస్త్రపరిజ్ఞానంపై పరిశోధనలు చేసేందుకు చాలా ఓర్పు సహనం అవసరమని, ఫలితం రాబట్టేందుకు చాలా కాలం వేచి చూడాల్సి రావొచ్చని ముర్ము అన్నారు. అందువల్ల ఎప్పుడూ నిరుత్సాహ పడకుండా లక్ష్యం దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కేఆర్ఎంబీ పరిధిలోకి కృష్ణా ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి..)

కేంద్రం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి ఇవ్వడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ గతంలోనే చెప్పింది. ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు అన్నారు. అయితే నోటిఫికేషన్ జారీ చేయడానికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని కేంద్రం (కేఆర్ఎంబీ) తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం నుంచి తగిన సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని వివరించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఆలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

# గ్రామ సమైఖ్య సంఘాలకు ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి..)

సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. వనమహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ధరణి, ఉద్యోగుల బదిలీలు, గృహనిర్మాణం తదితర అంశాలపై నేడు జిల్లా కలెక్టర్లతో సి.ఎస్ శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ లో 20.02 కోట్ల మొక్కలు నాటెందుకు లక్ష్యంగా నిర్ణయించామని, దీనిలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే వరంగల్ లో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలో సరిపడ మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఇటీవలి కాలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాల మేరకు నాణ్యమైన మొక్కలను నాటేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. నాటిన ప్రతీ మొక్క ను జియోటాగింగ్ చేయడంతో పాటు వాటి మనుగడకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో 100 శాతం ఖాళీ స్థలాలు కవర్ అయ్యే విధంగా మొక్కలు నాటేందుకు జిల్లాలోని సీనియర్ అధికారులు దత్తత తీసుకోవాలని సూచించారు. ఎ÷-లాంటేషన్ సైట్లను జిల్లా అధికారులు, క్షేత్ర స్థాయి అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల ఆర్థిక సహాయం రాష్ట్రంలో రానున్న ఐదేళ్ళలో రాష్ట్రంలోని 25 వేల గ్రామ సమైఖ్య సంఘాలకు కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయడం ద్వారా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులను చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక బృందాలలో ఇప్పటికీ చేరని మహిళలందందరినీ చేర్పించాలని, రానున్న ఐదేళ్ళలో స్వయం సహాయక మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్య సాధనకు త్వరలోనే ఒక విధాన నిర్ణయం పత్రాన్ని విడుదల చేయనున్నట్టు సి.ఎస్ తెలిపారు. మహిళా సంఘాల ద్వారా పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ ల తయారీ పనులను సకాలం లో పూర్తి చేసి ప్రశంసలు అందుకున్నారని అభినందించారు. రెండో సెట్ యూనిఫామ్ ల పనులను కూడా త్వరలోనే పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇందిరా క్యాంటీన్ ల ఏర్పాటు ను త్వరితగతిన ప్రారంభమయ్యేలా చొరవ చూపించాలి. ఇంకా అసంపూర్తిగా గా ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను రెండు వారాల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గత సంవత్సరం, ఈ నాటికి, 44 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ప్రస్తుత వానా కాలం సీజన్ లో ఇప్పటికే 50 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారని అన్నారు. అన్ని మండలాల్లో సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీని జిల్లా కలెక్టర్లు ప్రతీ రోజూ పర్యవేక్షించాలని సి.ఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 9 ఉమ్మడి జిల్లాల్లో రైతు భరోసా సదస్సులను నిర్వహిస్తున్నామని, ఈ సదస్సులకు ఆయా జిల్లాలోని రైతులు, రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ లో అతిసార, డెంగ్యూ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు సురక్షిత మార్గాలపై ప్రజలను చైతన్య పర్చడంతోపాటు, ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. ఇప్పటికీ, ఈ వ్యాధుల ఆనవాలు కన్పించిన జిల్లాల్లో మరింత అప్రమత్తతో ఉండాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో 24 / 7 పనిచేసే హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ లను ఏర్పాటు చేయాలన్నారు.

రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలకు సంబంధించి అందిన ధరణి ఫిర్యాదుల పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపించాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ శాంతి కుమారి ఆదేశించారు. ఇప్పటికే, గత రెండున్నర యేళ్లుగా 57 వేల దరఖాస్తులకు పైగా జిల్లాల్లో పరిష్కారించారని, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులన్నింటినీ పరిష్కరించ డానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు.





# జగ్జీవన్ రామ్‌ను విస్మరిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

- జగ్జీవన్‌రామ్ వర్ధంతి రోజు కనీసం నివాళులర్పించని ఎమ్మెల్యే శ్రీ గణేష్
- వైయస్సార్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే, జగ్జీవన్ రామ్‌కు ఎందుకు నివాళులర్పించలేదు
- మాదిగ సంఘాల నేతలు ఎమ్మెల్యే శ్రీ గణేష్‌పై ఫైర్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 09:**

50 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా పనిచేసే, ఎన్నో చట్టాలను అమలు చేసిన గొప్ప పార్లమెంటేరియన్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి రోజు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నివాళులర్పించకపోవడని తీవ్రంగా ఖండిస్తున్నామని, కంటోన్మెంట్ బి.ఎం.పి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి రొట్టెల సునీల్ మాదిగ లు, ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలోని 4వ వార్డులో మహనీయుల విగ్రహాల ముందు వారు మీడియాతో మాట్లాడుతూ.. వైయస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించడానికి సమయం ఉంది కానీ, దేశ నాయకుడైన మహనీయుడు జగ్జీవన్ రామ్ కు నివాళులర్పించడానికి సమయం లేదా, ఎమ్మెల్యే శ్రీ గణేష్ నువ్వు దళితుడివేనా అని ఆయనను ప్రశ్నించారు. మరొకసారి మహనీయుల జయంతి వర్ధంతి రోజు వివక్షత చూపిస్తే తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఆ మహనీయుల పుణ్యమాని నీవు ఎమ్మెల్యే వయ్యావని గుర్తుంచుకో అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సాయికుమార్, హరిప్రసాద్, జోడి బ్రదర్స్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పర్వతగిరి జడ్పీటిసి బానోత్ సింగ్‌లాల్

- లంబాడా లైవ్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు లావుడియా రాజు నాయక్

**ములుగు, (నేటి ఫోకస్ న్యూస్)-జూలై 9:**

మంత్రి సీతక్క జన్మదిన సందర్భంగా ములుగు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు పూల మొక్కలతో శాలువాతో స్వీట్ బాక్స్ లతో మంత్రి సీతక్కను జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో పర్వతగిరి జడ్పీటిసి బానోత్ సింగ్ లాల్ లంబాడి లైవ్ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు లావుడియా రాజు నాయక్ ట్రావెల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ వెంకన్న లంబాడా లైవ్ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ భూక్య మోహన్ తదితరులు పాల్గొని మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది.



# వరద నీటి కోసం వాకిటి ముందస్తు చర్యలు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**


వనపర్తి పట్టణంలోని 30వ వార్డులో గల రాజీవ్ గృహకల్ప, జంగిడి పురం, ఐజయ్య కాలనీ, న్యూటన్ కాలనీలలో వరద నీరు రాకుండా స్థానిక కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ముందస్తు చర్యలు చేపట్టారు. మంగళవారం మునిసిపాలిటీకి చెందిన జెసిబితో వరద కాల్వలో పెరిగిన పిచ్చి మొక్కలు, బురదను తొలగించి శుభ్రం చేయించారు. అకాల వర్షాలతో పైన పేర్కొన్న కాలనీలకు వరద నీరు ఉధృతంగా వచ్చి రోడ్లు ఎక్కి పారి ఇండ్లలోకి వెళ్లిన ఉదంతాలు గతంలో చాలా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ క్రమంలో వర్షాలు కురిస్తే ఎగువ నుంచి వరద నీరు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ముందే పసిగట్టిన ఆయన సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారులతో పాటు మునిసిపల్ పాలకవర్గం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో ఆయనే రంగంలోకి దిగి జెసిబి తో కాల్వలో పేరుకుపోయిన షిల్టు ను తొలగించి వరద నీరు సాఫీగా కిందికి వెళ్లే విధంగా చేయించడంతో కాలనీవాసులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.



# సిఎం రేవంత్‌తో క్రికెటర్ సిరాజ్ భేటీ

### టీమిండియా జెర్సీ బహుకరణ..

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**



టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత భారత క్రికెటర్లకు వారి వారి సొంత నగరాల్లో ఘనంగా స్వాగతం లభిస్తుంది. తాజాగా టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ హైదరాబాద్ చేరుకున్న తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ని కలిశారు. టీ20 వరల్డ్ కప్ గెలిచినందుకు సిరాజ్ ను సీఎం రేవంత్ రెడ్డి శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా సిరాజ్ టీమిండియా జెర్సీని సీఎం రేవంత్ రెడ్డికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్ అజారుద్దీన్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా ఇటీవలే జరిగిన టీ20 వరల్డ్ కప్‌ను భారత జట్టు గెలుచుకుంది. భారత జట్టుకు ఎంపికైనా 15మంది స్క్వాడ్‌లో సిరాజ్ ఒక సభ్యుడు. లీగ్ మ్యాచ్‌ల వరకు ఆడిన సిరాజ్,.. సూపర్ 8 మ్యాచ్‌లకు బెంచ్‌కు పరిమితమయ్యాడు. ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఒక వికెట్ పడగొట్టాడు. పొదుపుగా బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. సిరాజ్ ప్రస్తుతం జింబాబ్వే పర్యటనకు దూరంగా ఉన్నాడు. వరల్డ్ కప్ తర్వాత రెస్ట్ ఇచ్చిన ఆటగాళ్లలో సిరాజ్ ఒకరు. ఆగస్టులో సొంతగడ్డపై శ్రీలంకతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు సిరాజ్ అందుబాటులో ఉండనున్నాడు.

# కలుషితాహారం తిని విద్యార్థులకు అస్వస్థత

**మెదక్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ లో విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. ఉదయం అల్పాహారం దొడ్డు ఉప్మా తిన్న విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు చేసుకున్నారు. దీంతో వెంటనే 20 మంది విద్యార్థులను రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు సిబ్బంది. ముగ్గురికి తీవ్రస్వస్థతకు గురి కాగా.. మరో 17 మందికి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వీరిని పరీక్షించిన వైద్యులు ఇంటికి పంపించారు. ముగ్గురు విద్యార్థినీలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 20 మంది విద్యార్థులు తమకు కళ్ళు తిరుగుతున్నాయని చెప్పడంతో వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# ఖమ్మం జిల్లాలో మరో రైతు ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:** రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. సాగు సాగక, సర్కారు భరోసా కానరాక, అప్పులు తీర్చే మార్గం లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలో మరో రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గత పది రోజుల్లో ఖమ్మం జిల్లాలో ఇది నాలుగో సంఘటన కావడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం రజాబ్ అలీ నగర్‌కు చెందిన ప్రసాద్ (32) అనే రైతు 15 ఏళ్లుగా పోడు భూమి సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తనకు సంబంధించిన ఆరున్నర ఎకరాల భూమి విషయంలో ఓ కానిస్టేబుల్‌తో వివాదం నెలకొంది. సుమారు 15 ఏండ్లుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూమి లో కానిస్టేబుల్ తన కూతురు పేరుమీద అక్రమంగా పట్టా తీసుకున్నాడని ఆరోపిస్తూ రైతు ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

# బెట్టింగ్‌కు విద్యార్థి బలి

**హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-జులై 9:** బెట్టింగ్ వ్యసనం మరో విద్యార్థిని బలితీసుకున్నది. హైదరాబాద్ శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టింగ్‌లో లక్ష రూపాయలు నష్టపోవడంతో మనస్తాపం చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాలలో ఫీజు చెల్లించేందుకని ఈ ఉదయం తన తల్లి నుంచి లక్ష రూపాయలు తీసుకెళ్లిన విద్యార్థి.. ఆ మొత్తాన్ని బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. లక్ష రూపాయలు పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థి ఘట్‌కేసర్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డిఈ దానయ్య మృతి బాధాకరం

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల సంతాపం

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వనపర్తిలో రోడ్లు భవనాల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహించే దానయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దానయ్య ఆకస్మిక మృతి వనపర్తి పట్టణవాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ కు చెందిన ఆయన వనపర్తి లో సుదీర్ఘకాలంగా ఆర్ అండ్ బి శాఖలో విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందారు. వనపర్తిలో చేపట్టిన రోడ్ల విస్తరణలో ఆయన కృషి వెలకట్టలేనిదని, విస్తరణ జరిగిన రోడ్డు మధ్యలో ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వెలసిన ఫ్లెక్సీలు చూసి పట్టణవాసులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర రెడ్డిలు స్పందిస్తూ దానయ్య మృతి వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని అన్నారు. భగవంతుడు వారికి మనోధైర్యాన్ని కల్పించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.




## మద్దిమడుగు అంజనేయ స్వామి హుండీ లెక్కింపు

- రూ.41,88,753 ఆదాయం..
- వెండి 5 కేజీల 130 గ్రాములు

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)- చారగొండ వెంకటేష్ జులై 9:**

పదర మండలం మద్దిమడుగు అంజనేయ స్వామి హుండీ లెక్కింపు మంగళవారం ఈవో రంగాచారి, నాగర్ కర్నూల్ ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ లెక్కింపులో రూ. 41,88,753 ఆదాయం రాగా, మిశ్రమం వెండి 5 కేజీల 130 గ్రాములు వచ్చాయని ఈఓ రంగాచారి తెలిపారు. హుండీ లెక్కింపులు గ్రామస్తులు, దేవాదాయ శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. సీసీ కెమెరాల నడుమ హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జైపాల్ రెడ్డి, ఆలయ సిబ్బంది నాగరాజు, అజయ్, జంగయ్య, అర్చకులు వీరయ్య వాసు, రఘు కేశవ్, బ్యాంక్ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌ను అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతా

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రష్యా రాజధాని మాస్కోలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇక్కడికి తాను ఒక్కడినే రాలేదని, 140 కోట్ల మంది భారతీయుల ప్రేమను వెంట తీసుకొని వచ్చానని వ్యాఖ్యానించారు. పదేళ్లలో జరిగిన అభివృద్ధి జస్ట్ ట్రైలర్ మాత్రమే అన్నారు దేశం మారుతోందని ప్రపంచమంతా గర్విస్తోందన్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులు దేశాన్ని చూసి గర్విస్తున్నారని చెప్పారు. మహిళలను లక్షాధికారులను చేస్తున్నామన్నారు. భారత్‌లో పేదల కోసం 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. భారత్ జీ20 సదస్సును సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. కోవిడ్ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. భారత్ ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద హెల్త్ ఇన్సురెన్స్ స్కీంను అమలు చేస్తున్నామని తెలిపారు. 2024కు ముందు దేశం నిరాశతో ఉండేది.. ఇపుడు ఆత్మవిశ్వాసంతో నిండి ఉందన్నారు. డిజిటల్ పేమెంట్స్ తో కొత్త రికార్డులు సృష్టిస్తున్నామని చెప్పారు మోదీ. ప్రపంచంలోనే ఎత్తైన ప్రదేశంలో రైల్వే బ్రిడ్జి నిర్మించామని.. పదేళ్లలో 40వేల కి.మీ. రైల్వే లైన్లను ఎలక్ట్రిఫికేషన్ చేశామని, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మించామని పేర్కొన్నారు. దేశ అభివృద్ధిలో140 కోట్ల మంది భారతీయుల పాత్ర ఉందన్నారు. టీ20 వరల్డ్ కప్ గెలిచి దేశం సంబురాలు చేసుకుంది.. చివరి వరకు టీమిండియా పోరాడింది. ఓటమి ఒప్పుకోని వారినే విజయం వరిస్తుందన్నారు. భారత్ రష్యా మధ్య సంబంధాలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయన్నారు. 10 సంవత్సరాలలో సెమికండక్టర్ల నుంచి ఎలక్ట్రానిక్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాల వరకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల వరకు మరింత వేగంగా అభివృద్ధి చెందబోతున్నామని చెప్పారు. సవాళ్లను స్వీకరంచడంలో భారత్ ముందంజలో ఉంటుందన్నారు. ఏ దేశానికి సాధ్యం కాని విధంగా చంద్రయాన్ ప్రయోగం చేశాం. చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా గుర్తింపు పొందాం. డిజిటల్ లావాదేవీల్లో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా ఉన్నాం. స్టార్టప్‌ల్లో ప్రపంచంలోనే మూడో స్థానానికి చేరుకున్నాం. 2014లో వందల్లో ఉన్న స్టార్టప్‌లు నేడు లక్షల్లోకి చేరాయి. భారత్ రికార్డు స్థాయిలో పేటెంట్లను సాధిస్తోంది. ప్రపంచంలో అతిపెద్ద ఆరోగ్యబీమా వ్యవస్థ భారత్‌లో ఉంది. భారత్‌ను ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా నిలబెడతాను. మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే పటిష్ఠమైంది అని వివిధ రంగాల్లో భారత్ సాధిస్తోన్న విజయాలను ప్రస్తావించారు. భారత్ ఘనతను ప్రపంచం గుర్తించకతప్పని పరిస్థితి తెచ్చామని వ్యాఖ్యానించారు. భారత యువతే దేశ నిజమైన ఆస్తి అని, ఆత్మవిశ్వాసం దేశానికి అతిపెద్ద ఆయుధమని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం వేళ.. భారత విద్యార్థులు చిక్కుకుపోతే, వారిని కాపాడటంలో పుతిన్ సహకరించారని మోదీ గుర్తుచేశారు. ఈసందర్భంగా ఆయనతో పాటు రష్యా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్-రష్యా నమ్మకమైన మిత్రులు. పరస్పర విశ్వాసం, గౌరవం ఆధారంగా ఈ స్నేహం కొనసాగుతోంది. రష్యాలో చలి కాలంలో ఉష్ణోగ్రతలు మైనస్‌ల్లోకి పడిపోయినా, మన బంధం మాత్రం ఎప్పుడూ ప్లస్‌లోనే ఉంటుంది. మన స్నేహాన్ని ఆహ్లాదంగా ఉంచుతుంది. ఇప్పటివరకు నేను ఆరుసార్లు రష్యాలో పర్యటించాను. పుతిన్‌తో 17 సార్లు భేటీ అయ్యాను అని తెలిపారు. ఇకపోతే మోదీ, పుతిన్ 22వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షి సంబంధాలు, వాణిజ్యం, ఇంధన, రక్షణ రంగాల్లో సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చలు జరపనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం రష్యాకి చేరుకున్నారు. రష్యా రాజధాని మాస్కోలో ప్రధాని విమానం ల్యాండ్ కాగానే అక్కడి అధికారులు మోదీకి రెడ్ కార్పెట్ వేసి సాదర స్వాగతం తెలిపారు. దాండియా, గర్భా నృత్యాలతో రష్యా అధికారులు ఆయనకు వెల్‌కం చెప్పారు. ఈ పర్యటనలో భారత్, రష్యాల మధ్య పలు ముఖ్యమైన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉండే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నుండి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు జెలెన్స్‌కీ నుండి నాటో వరకు ప్రతి ఒక్కరూ ఈ సమావేశంపై దృష్టి పెట్టారు. 2025 నాటికి భారత్, రష్యాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. రష్యా 2025నాటికి 50 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య పలు అంశాలపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది. వాటిలో ప్రధానంగా టైర్ జెట్-57పై ఒప్పందం. భారత దేశంలో యాంటీ ట్యాంక్ షెల్స్‌ను తయారీ పరిశ్రమకు సంబంధించి ఒప్పందం చేసుకునే అవకాశం ఉంది. మ్యాంగో ఆర్మర్-పియర్సింగ్ ట్యాంక్ రౌండ్ ఫ్యాక్టరీ డీల్, సైనిక లాజిస్టిక్స్ ఒప్పందంపై చర్చ, ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు ప్రాధాన్యత, ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చర్చ, రక్షణ, చమురు, గ్యాస్‌కు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

ఫోకస్ న్యూస్


# 'కల్కి' అద్భుత దృశ్యకావ్యం

## – నాగ్‌అశ్విన్‌కు మహేశ్ బాబుకు అభినందనలు..

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ'పై ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. విడుదలైన రోజు నుంచి సినీ, రాజకీయ ప్రముఖులు ఈ చిత్రబృందాన్ని అభినందిస్తూ పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు వారి అభిప్రాయాన్ని తెలుపగా.. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు ఎక్స్ వేదికగా కల్కి టీమ్‌కు శుభాకాంక్షలు చెప్పారు. తనదైన శైలిలో మూవీపై రివ్యూ ఇచ్చారు. కల్కి ఓ అద్భుతం.. జస్ట్ వావ్. నాగ్ అశ్విన్ విజన్‌కు హ్యాట్సాఫ్. ప్రతి ఫ్రేమ్ కళాఖండంలా ఉంది. అమితాబ్ బచ్చన్ స్క్రీన్ ప్రజెన్స్‌కు ఎవరూ సరితూగరు. కమల్ హాసన్ ప్రతి పాత్రకు జీవం పోస్తారు. ప్రభాస్ గొప్ప క్యారెక్టర్‌లో చాలా సులభంగా నటించారు. దీపిక ఎప్పటిలాగే అద్భుతంగా కనిపించారు. ఇంతటి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న వైజయంతీ మూవీస్‌కు అభినందనలు అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు దర్శకుడు స్పందిస్తూ.. ధన్యవాదాలు చెప్పారు. 'మీ అభినందనలు అందుకోవడం మా టీమ్‌కు ఆనందంగా ఉంది' అని రిప్లై ఇచ్చారు. నిర్మాణసంస్థ కూడా మహేశ్‌కు థ్యాంక్స్ చెప్పింది.'కల్కి 2898 ఏడీ' విడుదలకు ముందు నుంచే అమెరికాలో ప్రభంజనం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. అక్కడి ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పిన నాగ్ అశ్విన్ వారితో కలిసి ఈ సినిమా వీక్షించనున్నారు.









# టూ పీసెస్ దుస్తులు వేసుకోమన్నారు..



'బొంబాయి'తో దక్షిణాది సినీప్రియులకు చేరువయ్యారు నటి మనీషా కొయిరాల. ఆ సినిమా విజయం తర్వాత పలు కోలీవుడ్ చిత్రాల్లో నటించి మెప్పించారు. కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని మనీషా తాజాగా గుర్తుచేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో ఫొటోషూట్‌లు చేస్తామని కొందరు అడిగేవారు. ఆ సమయంలో ఓ ఫొటోగ్రాఫర్ నన్ను తెగ ప్రశంసించాడు. నేను సూపర్ స్టార్ అవుతానంటూ పొగిడాడు. ఆ తర్వాత టూ పీసెస్ డ్రెస్ తీసుకొచ్చి వేసుకోవాలని సూచించాడు. నేను స్విమ్మింగ్ చేసే సమయంలోనే ఇలాంటి డ్రెస్‌లు వేసుకుంటానని.. సినిమాల్లో అవకాశాల కోసం ఇలాంటి డ్రెస్‌లు వేసుకోను అని నిర్మొహమాటంగా చెప్పేశాను. దీంతో ఆయన నన్ను తిట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. 'కరగడానికి నిరాకరించే మట్టిముద్ద నుంచి ఎవరూ బొమ్మను తయారు చేయలేరు' అని అన్నాడు. నేను ఆ మాటలను ఇప్పటికీ మర్చిపోలేదు. అందరి మనస్తత్వం ఒకేలా ఉండదని అర్థం చేసుకున్నా. పెద్ద సెలబ్రిటీ అయ్యాక అతడే వచ్చి నాకు ఫొటోషూట్ చేశాడు' అని మనీషా గుర్తుచేసుకున్నారు. 1991లో ఇండస్ట్రీకి వచ్చిన మనీషా ఆతర్వాత పలు భాషల్లో వరుస హిట్ చిత్రాల్లో నటించి అలరించారు. 'బొంబాయి'తో తెలుగు ప్రేక్షకులకు అభిమాన నటిగా మారారు. 2012లో ఆమె అండాశయ క్యాన్సర్‌తో బాధ పడుతున్నట్లు వెల్లడించారు. 2014లో దానినుంచి కోలుకున్నట్లు తెలిపారు. క్యాన్సర్ బారినపడడంతో కొన్నేళ్లపాటు విరామం తీసుకున్న ఆమె ఇటీవల సంజయ్‌లీలా భన్సాలీ తెరకెక్కించిన 'హీరామండి' వెబ్ సిరీస్‌లో మల్లికాజాన్‌గా తన నటనతో ఆకట్టుకున్నారు. ప్రస్తుతం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారమవుతోంది. త్వరలోనే ఈ వెబ్‌సిరీస్ రెండో భాగం ప్రారంభం కానుంది..

# ఓ ముసలి నక్క..


## హరీశ్ శంకర్ వార్నింగ్..



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తాజాగా పెట్టిన పోస్ట్ సంచలనం రేపుతోంది.హరీశ్ శంకర్ తన సినిమా అప్‌డేట్‌లను సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో పాటు అభిమానులకు రిప్లయ్ ఇస్తూ వారికి ఎప్పుడూ టచ్‌లో ఉంటారు. అయితే,కొన్నిసార్లు ట్వీట్స్ వార్ కూడా జరుగుతూ ఉంటుంది. ఇపుడు అలాంటి స్ట్రాంగ్ వార్నింగ్ ఒకటి ట్విట్టర్ ద్వారా షేర్ చేశారు. వివరాల్లోకి వెళితే..ప్రస్తుతం డైరెక్టర్ హరీష్ శంకర్ రెండు సినిమాలను తెరకెక్కిస్తూ బిజీగా ఉన్నారు. అందులో ఒకటి ఉస్తాద్ భగత్ సింగ్ కాగా మరొకటి రవితేజతో మిస్టర్ బచ్చన్. ఈ నేపథ్యంలోనే మొన్నటికి మొన్న ఉస్తాద్ భగత్ సింగ్ ఆగిపోతుందంటూ ఓ నెటిజన్ నుంచి కామెంట్స్ వినపడగా గట్టి వార్నింగ్‌తో ఇచ్చిపడేశాడు. ఇక తాజాగా మిస్టర్ బచ్చన్ మీద గత కొన్ని రోజులుగా పలు కామెం ట్స్ వినిపిస్తున్నాయి.ఎందుకంటే, ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకుని వచ్చే నెల ఆగస్టు 15న రిలీజ్‌కు రెడీ అవుతుంది. దీంతో ఈ సినిమాకి సంబంధించి గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో రకరకాల చర్చలు ఊపందుకుంటున్నాయి. కొంత మంది జర్నలిస్టులు కూడా ఈ సినిమాకి సంబంధించిన లీకులు ఇస్తు వస్తున్నారు.అయితే సినీ సర్కిల్‌లో వినిపిస్తున్న గుసగుసల మేరకు..ఒక సదరు జర్నలిస్ట్ గురించి డైరెక్టర్ హరీష్ శంకర్ తాజాగా చేసిన ట్వీట్.. ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. 'రిలీజ్ దగ్గర పడుతుంది కదా, ఏం పోస్ట్ చేసిన భయపడి తగ్గుతాడు అని ఒక ముసలి నక్క మళ్ళీ మొదలు పెడుతోంది. దయచేసి అలాంటి అపోహలు పెట్టుకోవద్దని మనవి..నా జోలికొస్తే రేపు రిలీజ్ అయినా వదలను' అంటూ హరీష్ శంకర్ వార్నింగ్ ఇచ్చారు. అయితే,ఎవరిపై ఇంతటి కామెంట్స్ చేశాడనేది క్లారిటీ రావాల్సి ఉంది.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వీడియో

## 'భారతీయుడు-2' బృందానికి సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు



భారతీయుడు2' చిత్ర బృందానికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ ,సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో సీక్వెల్‌గా తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం భారతీయుడు2. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జులై 12న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్‌ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ఇప్పుడీ సినిమా యూనిట్.. సీఎం రేవంత్ రెడ్డి షరతును పాటించి ఓ వీడియోను విడుదల చేశారు. అందుకుగానూ సీఎం చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. టీవల సీఎం రేవంత్ రెడ్డి సినిమాల విడుదలకు ముందు టికెట్ల ధరలను పెంచాలని మా వద్దకు వచ్చేవారు తప్పని సరిగా డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తూ వీడియో ను చేయాలని షరతు విధించారు. డ్రగ్స్‌పై మెగాస్టార్ చిరంజీవి చేసిన ఓ వీడియో గురించి చెబుతూ.. ప్రతి ఒక్కరూ అలా అవగాహన కల్పించేలా వీడియోలు చేయాలని కోరారు. ఇదే విషయాన్ని 'భారతీయుడు2' మీడియా సమావేశంలో ఓ మీడియా పర్సన్ చిత్రయూనిట్‌ని ప్రశ్నించగా.. హీరో సిద్దార్థ్ కల్పించుకుని.. 'ఇప్పటి వరకు ఏ సీఎం కూడా మీరు ఇది చేస్తే, మేము అది చేస్తామని చెప్పలేదు' అంటూ వ్యంగ్యంగా సమాధాన మిచ్చారు. కానీ మీడియా సమావేశం అయిన కాసేపటికే తన మిస్టేక్‌ను తెలుసుకుని.. సారీ చెబుతూ, సీఎం రేవంత్ రెడ్డి షరతు తప్పకుండా పాటిస్తామని ప్రకటించారు. అనంతరం కమల్ హాసన్, డైరెక్టర్ శంకర్, సిద్దార్థ్, సముద్రఖని.. డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ.. ఓ వీడియోని విడుదల చేశారు.

